సాక్షి
ప్రకాశం
శనివారం । 30 । మార్చి । 2024



క్రీస్తు స్మృతిలో..

లోకరక్షకుడైన ఏసుక్రీస్తు పాప పంకిలమైన జగత్తును తన పరిశుద్ధాత్మతో సంస్కరించేందుకు శిలువపై రక్తం చిందించిన పవిత్ర దినం గుడ్‌ఫ్రైడేని జిల్లాలో శుక్రవారం క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.

గరిష్టం/కనిష్టం
36.7/26.2

వాతావరణం

పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఉక్కపోతగా ఉంటుంది. వాతావరణంలో తేమ శాతం అధికం.

రంజాన్ వేళలు

శనివారం - ఇఫ్తార్ : సా॥ 6.27
ఆదివారం - సహరీ : ఉ॥ 4.46



దొరహంకారం



- పేదలపై చంద్రబాబు చులకన వ్యాఖ్యలు
- ఎస్సీల్లో ఎవరైనా పుట్టాలని కోరుకుంటారా అంటూ గతంలో వ్యాఖ్యలు
- నాయీబ్రాహ్మణుల తోకలు కత్తిరిస్తానంటూ హెచ్చరికలు
- ఇప్పుడు టిప్పర్ డ్రైవర్ అంటూ అవహేళన

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

టీడీపీ అధినేత చంద్రబాబు 'దొర'తనంతో దురాహంకారాన్ని మరోసారి చూపించారు. ఆయనకు పేదలంటే ఎంత చులకనో ఆయన వ్యాఖ్యలతో రుజువైంది. న్యాయమూర్తులుగా బీసీలు పనికి రారంటూ లేఖ రాసిన చంద్రబాబు, తాజాగా కూలీలను చట్టసభలకు పంపడం ఏమిటంటూ టిప్పర్ డ్రైవర్లను అవహేళన చేస్తూ పేదల పట్ల ఆయన వైఖరిని చాటుకున్నారు. గతంలో దళితుల్లో పుట్టాలని ఎవరూ కోరుకోరని వ్యాఖ్యానించిన ఆయన.. ఆ తర్వాత తమకు ప్రాధాన్యత కల్పించాలంటూ అభ్యర్థించిన నాయీబ్రాహ్మణుల తోకలు కత్తిరిస్తానంటూ పరుషంగా మాట్లాడారు. తాజాగా అనంతపురం జిల్లా శింగనమల అసెంబ్లీ అభ్యర్థిగా ఓ టిప్పర్ డ్రైవర్ అయిన వీరాంజనేయులుకు వైఎస్సార్‌సీపీ టికెట్ ఇవ్వడాన్ని చంద్రబాబు అవహేళన చేశారు. చంద్రబాబు వ్యాఖ్యలపై రాష్ట్ర వ్యాప్తంగా డ్రైవర్లు, వారి కుటుంబ సభ్యులు అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గానికి వైఎస్సార్‌సీపీ ఒక టిప్పర్ డ్రైవర్‌ను ఎమ్మెల్యే అభ్యర్థిగా నిలబెట్టింది. ఎన్నికల ప్రచారంలో ఉన్న చంద్రబాబు మాట్లాడుతూ వేలిముద్రగాళ్లకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి టికెట్ ఇచ్చారంటూ ఎగతాళి చేశారు. వాస్తవానికి అభ్యర్థి వీరాంజనేయులు ఎంఏ ఎకనామిక్స్, బీఈడీ చేశారని, విద్యావంతుడైన ఆయన డ్రైవర్ వృత్తి చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడని, అలాంటి వ్యక్తికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి టికెట్ ఇస్తే తప్పేంటని నిలదీస్తున్నారు. డ్రైవర్లు చంద్రబాబు వ్యాఖ్యలపై మండిపడ్డారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు దివంగత నందమూరి తారకరామారావు తన చైతన్య రథానికి సొంతకొడుకుని రథసారధిగా పెట్టుకున్నారన్న విషయాన్ని మరిచిపోయారా? అంటూ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఆయన తిరిగే కార్లు డ్రైవర్లు నడపడం లేదా? అంటూ నిలదీశారు. దమ్ముంటే జగన్‌మోహన్‌రెడ్డి టికెట్ ఇచ్చిన వ్యక్తిపై పోటీ చేసి గెలవాలని సవాల్ విసురుతున్నారు.

బలహీన వర్గాలపై చిన్నచూపు తగదు



మాజీ సీఎం చంద్రబాబుకు బలహీన వర్గాల పట్ల చిన్న చూపు తగదు. గతంలో ఎస్సీ కులంలో ఎవరు పట్టాలనుకుంటారు.. నాయిబ్రాహ్మణుల తోకలు కత్తిరిస్తానంటూ అహంకారం ప్రదర్శించారు. నేడు శింగనమల వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిని టిప్పర్ డ్రైవర్ అంటూ అవహేళన చేయడం సిగ్గుచేటు. డ్రైవర్ లేకుండా చంద్రబాబు ముందుకు వెళ్లగలడా. డ్రైవర్ల విలువ తెలియకుండా చంద్రబాబు నీతిమాలిన మాటలు మాట్లాడటం ఎంతవరకు సమంజసం. డ్రైవర్లు చంద్రబాబుకు తగిన బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయి.

– బుద్దుల బిన్నయ్య, అంబేడ్కర్‌కాలనీ, ఆటో డ్రైవర్, బేస్తవారిపేట

డ్రైవర్లు అంటే అలుసా..



లారీ డ్రైవర్లు అంటే చిన్న చూపు ఎందుకు? చదువుకుని ఉద్యోగాలు రాని వాళ్లు చాలా మంది ఉన్నారు. బయటకు వెళితే వస్తామో రామో తెలియని పరిస్థితులు దాటుకుని సంపాదిస్తూ కుటుంబాలను పోషించుకునే డ్రైవర్లు అంటే చంద్రబాబు కించపరిచేలా మాట్లాడడం సరికాదు. ఆయన తిరిగే కార్లు డ్రైవర్లు నడపడం లేదా.. సాటి మనిషిని మనిషిగా చూడని చంద్రబాబు అంటే అసహ్యం వేస్తోంది. పైగా డ్రైవరుకు ఎమ్మెల్యే సీటు అంటూ ఎగతాళిగా మాట్లాడడం ఆయన వయసుకు సరికాదు. శింగనమల ఎమ్మెల్యేగా ఒక డ్రైవర్‌కు సీటు ఇవ్వడం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యం. దమ్ముంటే అదే డ్రైవర్‌పై చంద్రబాబు పోటీ చేయాలి.

– జైపాల్ యాదవ్, లారీ డ్రైవర్, వెల్లంపల్లి, మద్దిపాడు మండలం

డ్రైవర్లు ఎమ్మెల్యే కాకూడదా?



డ్రైవర్లు అంటే నీకు అంత చులకనగా కనిపిస్తున్నారా చంద్రబాబు. డ్రైవర్లు డ్రైవర్లుగానే ఉండాలా? డ్రైవరు లేకపోతే నీవు ఇంట్లో నుంచి బయటకు ఎలా వస్తావు, ప్రచారం ఎలాచేస్తావు? నీ కారు డ్రైవరు కను రెప్పకొడితే నీ బతుకు గల్లంతవుతుంది. డ్రైవర్లు జీవితంలో ఎదగటం ఇష్టం లేదని నీ హేళన ద్వారా రుజువు చేశావు. నీ నిజస్వరూపం బయటపెట్టుకుని రాక్షస ఆనందం పొందుతున్నావు. మా ఓట్లు కావాలి కానీ మేము అభివృద్ధి చెందకూడదా? రాబోయే ఎన్నికల్లో మా డ్రైవర్ల సత్తా చూపిస్తాం జాగ్రత్త. మా డ్రైవర్ల స్థాయిని పెంచేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి టిప్పర్ డ్రైవరుకు సీటు ఇవ్వటం మా డ్రైవర్లకే గర్వంగా ఉంది. మమ్మల్ని హేళన చేసిన నీకు బుద్ధిచెప్తాం.

– ధర్మారెడ్డి, డ్రైవర్, కాటంవారిపల్లె, కురిచేడు మండలం

చంద్రబాబు మాటలు ఉపసంహరించుకోవాలి



చంద్రబాబు నాయుడు తక్షణం తన మాటలను ఉపసంహరించుకోవాలి. వైఎస్సార్ సీపీ శింగనమల నియోజకవర్గంలో టిప్పర్ డ్రైవర్‌కు టిక్కెట్ ఇచ్చారంటూ చంద్రబాబు ఎగతాళి చేస్తూ..అవహేళనగా మాట్లాడటం తగదు. చంద్రబాబు దిగజారుడు మాటలకు ఇది నిదర్శనం. వైఎస్సార్ సీపీ పేదల పార్టీ, టీడీపీ పెత్తందారుల పార్టీ.

– ఎస్‌కే రహిమాన్, కార్ డ్రైవర్, కనిగిరి

చంద్రబాబు నిజరూపం అది..



పేదలంటే చంద్రబాబుకు అలుసు. అందుకే జగన్ టిప్పర్ డ్రైవర్‌కు ఎమ్మెల్యే సీటు ఇచ్చారని హేళన చేశారు. టిప్పర్ డ్రైవర్ అని పదే పదే చెప్తూ డ్రైవర్లంతా మానసికంగా కృంగిపోయేలా చంద్రబాబు మాటలు ఉన్నాయి. చంద్రబాబుకు డ్రైవర్లందరూ సరైన బుద్ధి చెప్తాం. ఎడమ చేత్తో వేలి ముద్రలు వేసేవాళ్లంటూ హీనంగా మాట్లాడారు. చంద్రబాబుకు వేలి ముద్రలు వేసే వారి ఓట్లు అవసరం లేదు. ఆయనకు పేదలంటే అలుసు. జగనన్న మంచి మనసున్నోడు కాబట్టే టిప్పర్ డ్రైవర్‌కు ఎమ్మెల్యే టిక్కెట్ ఇచ్చాడు. డ్రైవర్లు, పేదలందరూ చంద్రబాబుకు ఓటెయ్యవద్దు.. చంద్రబాబుది స్వార్థపు బుద్ధి. వాళ్లలా పెద్ద పెద్ద ధనవంతులు మాత్రమే ఎమ్మెల్యేలు కావాలని కోరుకుంటాడు.

– పనస భూషగౌడ్, టిప్పర్ డ్రైవర్, దర్శి

ప్రకాశం టీడీపీలో భగ్గుమన్న విభేదాలు



మాట్లాడుతున్న నూకసాని బాలాజీ

ఒంగోలు సబర్బన్: జిల్లా టీడీపీలో ముఖ్య నాయకుల మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. సాక్షాత్తు ఆ పార్టీ 42వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బయటపడటంతో ఆ పార్టీ నాయకుల్లో తీవ్ర అలజడి నెలకొంది. జిల్లా టీడీపీ అధ్యక్షుడు డాక్టర్ నూకసాని బాలాజీ ఒంగోలు నగరంలోని భాగ్యనగర్ మూడో లైన్‌లో ఉన్న టీడీపీ పార్లమెంట్ కార్యాలయంలో మీడియాతో శుక్రవారం మాట్లాడారు. పార్టీలో కొంతమంది నాయకులు అహంకార పూరిత రాజకీయాలు చేస్తున్నారని, అలాంటి వారికి చరమ గీతం పాడేందుకు సిద్ధమయ్యానని తన మనసులోని మాటను బయటపెట్టారు. పార్టీలో వివక్షత పెచ్చరిల్లిపోయిందని, దౌర్జన్యాలు అధికమయ్యాయని ఆక్రోశం వ్యక్తం చేశారు. అలాంటి వారివల్ల పార్టీకి చెడ్డపేరు వస్తోందని వెల్లడించారు. నేనే పెత్తందారుని అని, అందరూ నా మాటలే వినాలి అని, నా మాటే చెల్లుబాటు కావాలి అని కొంతమంది నాయకులు తయారయ్యారన్నారు. ఇప్పుడు చెప్పినవి చాలా చిన్న విషయాలని, అసలు చర్చ వేరేగా ఉందని, మొత్తం రెండు, మూడు రోజుల్లో అన్నీ బట్టబయలు చేస్తానన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవాలు విడివిడిగా నిర్వహించటంతో కేడర్ ఒక్కసారిగా అవాక్కయ్యారు. జిల్లా పార్టీ కార్యాలయంలో నూకసాని బాలాజీ ఆధ్వర్యంలో జరిగింది. ఆ కార్యక్రమానికి నూతనంగా పార్టీలో చేరి చంద్రబాబు శుక్రవారమే ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థిగా ప్రకటించిన ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు. అదే విధంగా పాత గుంటూరు రోడ్డులోని దామచర్ల కార్యాలయంలో నిర్వహించిన పార్టీ ఆవిర్భావ దినోత్సవానికి కూడా మాగుంట హాజరు కావటం విడ్డూరంగా మారింది. ఒకపక్క అటు బీసీ యాదవ సామాజిక వర్గానికి చెందిన జిల్లా పార్టీ అధ్యక్షుడు నూకసాని వ్యాఖ్యలు, మరో పక్క విడివిడిగా ఇటు పార్టీ ఆవిర్భావ దినోత్సవాలు జరుపుకోవటంతో జిల్లా వ్యాప్తంగా టీడీపీలో అయోమయం నెలకొంది.

న్యూస్‌రీల్

1, 2 తేదీల్లో రాష్ట్ర స్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు

కొనకనమిట్ల: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వెలుగొండలో నిర్వహించే శ్రీవారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఏప్రిల్ 1, 2వ తేదీల్లో రెండు రోజుల పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రస్థాయి ఎడ్ల బండ లాగుడు బలప్రదర్శన పోటీలు నిర్వహించనున్నట్లు వెలుగొండ దేవస్థానం చైర్మన్ సాని కొమ్ము తిరుపతిరెడ్డి, మేకలవారిపల్లి రెడ్ల సంఘం కమిటీ సభ్యులు తెలిపారు. 1వ తేదీన 2 పండ్ల సైజు విభాగంలో ఎడ్ల బండలాగుడు పోటీలు ప్రారంభమవుతాయి. ఏప్రిల్ 2వ తేదీన 6 పళ్ల సైజు విభాగంలో ఎడ్ల బండ లాగుడు పోటీలు ఉంటాయన్నారు. ఆయా విభాగాల్లో విజేతలైన ఎడ్ల యజమానులకు బహుమతులు ఇవ్వనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి, పోటీల నిర్వాహకులు తెలిపారు.

బహుమతుల వివరాలు..

2 పళ్ల సైజు విభాగంలో గెలుపొందిన ఎడ్లకు ఒకటి నుంచి ఏడు వరకు బహుతులు వరుసగా రూ.25 వేలు, రూ.20 వేలు , రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలు అందజేస్తామన్నారు. 6 పళ్ల సైజు విభాగంలో గెలుపొందిన ఎడ్లకు ఒకటి నుంచి ఐదు వరకు బహుమతులు వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు అందజేస్తామన్నారు. వివరాలకు 81799 21128, 95811 37317, 99120 32442, 9703524622, 8374329125 నంబర్లను సంప్రదించాన్నారు.



చెవిరెడ్డి, నాగార్జునరెడ్డి, అన్నా రాంబాబు, ప్రణీత్‌రెడ్డిలను గజమాలతో సత్కరిస్తున్న నాయకులు



చెవిరెడ్డికి ర్యాలీలో ఘనస్వాగతం పలుకుతున్న ప్రజలు

వెలుగొండ ప్రాజెక్టుతో సస్యశ్యామలం

- మీతోనే ఉంటా.. మీలో ఒకడిగా కలసిపోతా
- నమ్మినవారి కోసం ప్రాణాలైనా ఇస్తా..
- వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి
- నా కంటే తమ్ముడు నాగార్జునకు అధిక మెజార్టీ రావాలి : ఎమ్మెల్యే అన్నా
- అత్యధిక మెజార్టీతో జగనన్నకు కానుకగా ఇద్దాం : ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి
- వైఎస్సార్‌సీపీకి మేము విధేయులం : బాలినేని ప్రణీత్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న చెవిరెడ్డి భాస్కరరెడ్డి, పక్కన కేపీ నాగార్జునరెడ్డి, అన్నా రాంబాబు, ప్రణీత్‌రెడ్డి

గిద్దలూరు రూరల్: జగనన్న ప్రభుత్వంలో వెలుగొండ ప్రాజెక్టు పూర్తయి ఈ ప్రాంతం సస్యశ్యామలం కాబోతోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అన్నారు. గిద్దలూరు సమన్వయకర్త, మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి అధ్యక్షతన గిద్దలూరు పట్టణంలోని నరవ రోడ్డులో సీతారామ కల్యాణ మండపంలో నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి తాటిచెర్ల మోటు నుంచి బైక్‌ర్యాలీతో పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి సీతారామకల్యాణ మండపం వరకు పెద్ద ఎత్తున భారీ ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్ సీపీ యువనాయకుడు వేమిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో భారీ గజమాలతో చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో చెవిరెడ్డి మాట్లాడారు. జిల్లాలోనే వెనుకబడిన ప్రాంతంగా ఉన్న పశ్చిమ ప్రకాశానికి వెలుగొండ జలాలు అందించేందుకు శాయశక్తులా కృషి చేస్తామన్నారు. ఎన్ని కోట్లు ఖర్చయినా సరే నియోజకవర్గ అభివృద్ధికి వెనుకాడబోమని హామీ ఇచ్చారు. తన రాజకీయ జీవితం రాజారెడ్డి తో మొదలై వైఎస్.ఆర్‌తో ప్రయాణిస్తూ ఆయన కుటుంబంలో ఒకడిగా మెలిగానన్నారు. రాజశేఖరరెడ్డి దయతోనే నేను ఇప్పుడు ఈ విధంగా ఉన్నానన్నారు. ఆయన కుటుంబానికి అత్యంత సన్నిహితుడిగా మీ ఆదరణ, అభిమానాలు పొందానని చెప్పారు. జగనన్న కోసం ఓదార్పుయాత్ర, పాదయాత్రలో పాల్గొని ప్రజల్లో గుర్తింపు పొందానన్నారు. మీతోనే ఉంటూ మీలో ఒకడిగా కలిసిపోతూ మీతోనే కలిసి ప్రయాణం చేస్తానని భరోసా ఇచ్చారు. నాకు ఎటువంటి వ్యాపారాలు, వ్యసనాలు లేవని.. ఉన్న వ్యసనం అంతా మీతో కలిసి ప్రయాణించడమే అని అన్నారు. నమ్మిన వ్యక్తుల కోసం అవసరమైతే ప్రాణాలు అర్పించే మనస్తత్వం మాది అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి మీ పై నమ్మకంతో నన్ను ఎంపీ అభ్యర్థిగా నిలబెట్టాడన్నారు. మీ నమ్మకాన్ని ఒమ్ము చేయబోనన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామ పంచాయతీకి వస్తా.. వారి సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు.

పులివెందులకు దీటుగా గిద్దలూరు...

పులివెందులకు దీటుగా గిద్దలూరు నియోజకవర్గాన్ని నిలబెట్టాలని.. అది మీ చేతుల్లోనే ఉందని గిద్దలూరు సమన్వయకర్త మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి అన్నారు. గత ఎన్నికల్లో జగనన్న తరువాత రెండో స్థానంలో అత్యధిక మెజార్టీతో గెలిపించిన గిద్దలూరు స్థానంలో వచ్చే ఎన్నికల్లో కూడా అత్యధిక మెజార్టీ సాధించి జగనన్న హృదయంలో నిలవాలన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మీ కుటుంబానికి లబ్ధి పొందితేనే మాకు ఓటు వేయండి అని జగనన్న ధైర్యంగా చెబుతున్నాడన్నారు. జగనన్న ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా అర్హుడైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకం పొందారన్నాని చెప్పారు.

నాకంటే ఎక్కువ మెజార్టీ రావాలి..: అన్నా రాంబాబు

గిద్దలూరు నియోజకవర్గంలో గతంలో తనకు వచ్చిన మెజార్టీ కంటే తమ్ముడు నాగార్జునరెడ్డికి ఎక్కువ మెజార్టీ రావాలని ఎమ్మెల్యే అన్నా రాంబాబు పిలుపునిచ్చారు. నా ఆరోగ్య సమస్య కారణంగా జగనన్న నన్ను మార్కాపురం నుంచి పోటీ చేయమన్నాడు... నాగార్జునరెడ్డిని గిద్దలూరు నుంచి పోటీ చేయమన్నాడు.. ఇద్దరం వేరు కాదు ఇద్దరం ఒక్కటే మా మధ్య తేడాలేదని అందరూ నాగార్జునరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రతి పోలింగ్ బూత్ లోనూ మెజార్టీ రావాలని, అందుకు పార్టీ అభిమానులు, నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. తల్లిపాలు తాగి రొమ్ముగుద్దే సోది రాజకీయాలు చేయడం నాకు చేత కాదంటూ భావోద్వేగానికి గురయ్యారు. ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉన్న ఏకైక ప్రభుత్వం జగనన్న ప్రభుత్వం అని అన్నా రాంబాబు అన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చిన ఏకైక నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. జగనన్న ఒక్కడు ఒక వైపు.. చంద్రబాబు మిత్రపక్ష పార్టీలన్నీ ఒక వైపు ఉన్నాయన్నారు. జగనన్నకు మీ అండదండలు ఉన్నంత వరకు ఎవరూ ఏమీ చేయలేరన్నారు. ఎవరి మీదా అబద్ధాలు చెప్పనవసరం లేదని.. చేసింది చెప్తూ ప్రజల్లోకి వెళ్లడమే మన ఏజెండా అని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి తన శాయశక్తులా కృషి చేశానని హామీ ఇచ్చారు.

ఎప్పటికీ పార్టీకి విధేయులమే..

మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి కుమారుడు బాలినేని ప్రణీత్‌రెడ్డి మాట్లాడుతూ బాలినేని శ్రీనివాసరెడ్డి పై కొందరు గిట్టని వ్యక్తులు పార్టీ మారుతున్నాడని తప్పుడు ప్రచారాలు చేశారని.. అవసరమైతే రాజకీయం మానుకుంటామే కానీ పార్టీని మారే ప్రసక్తే లేదని చెప్పారు. తాను, తన తండ్రి ఇద్దరం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఎప్పటికీ విధేయులమే అన్నారు. కార్యక్రమంలో కంభం మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ యువనాయకులు నాయకులు పిడతల ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఎంపీపీ కడప లక్ష్మీ, వైస్ చైర్మన్లు ఆర్.డి.రామకృష్ణ, కాతా దీపికా, కొమరోలు జెడ్పీటీసీ వెంకటనాయుడు, మాజీ ఎంపీపీ కడప వంశీధరరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ కోటా నరసింహులు, నాయకులు డా.భూమా నరసింహారెడ్డి, పి.రామకృష్ణారెడ్డి, వెంకటరామిరెడ్డి, ఓబులరావు, కావేటి ఈశ్వర్‌నాయుడు, ఆర్యవైశ్య విభాగం నాయకులు గర్రె చిరంజీవి, పర్చూరి నాగేశ్వరరావు, బాదం గోపాల్, గర్రె వెంకటసుబ్బారావు, దేమా శ్రీరాములు, సీఆర్‌బి మురళి, నాసరి శ్రీను, పాలుగుళ్ల అనసూయ, బండారు నిర్మలా, బెల్లం రమాదేవి, మైనార్టీ నాయకులు శంశీర్ అలీబేగ్, బేస్తవారిపేట జెడ్పీటీసీ వెంకటరాజు, కంభం ఏఎంసీ ఏలం వెంకటేశ్వర్లు, చెదుళ్ల రమణారెడ్డి, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, సర్పంచులు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలి

- మంత్రి ఆదిమూలపు సురేష్



జగ్గరాజుపాలెంలో వైఎస్సార్ సీపీ నాయకులతో మాట్లాడుతున్న మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

మర్రిపూడి: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవడానికి క్షేత్ర స్థాయిలో కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. మండలంలో జగ్గరాజుపాలెం గ్రామంలో శుక్రవారం గుడ్‌ఫ్రైడే సందర్భంగా మండల నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక విషయాలు తెలుసుకున్న అనంతరం అనంతరం ఆయన మాట్లాడుతూ కార్యకర్తలు, నాయకులు ఎవరూ అధైర్యపడవద్దని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలే వైఎస్సార్ సీపీని గెలిపిస్తాయన్నారు. దశ దిశ లేని పొత్తుల పార్టీలను రాష్ట్ర ప్రజలు నమ్మబోరన్నారు. వైఎస్సార్ సీపీ నుంచి టీడీపీలోకి వలసలు ఉన్నాయన్న వదంతులు నమ్మవద్దన్నారు. ఇది చంద్రబాబునాయుడు అండ్‌కో ఆడుతున్న కపట నాటకమన్నారు. నియోజకవర్గంలోని ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ప్రజలకు సేవచేసే భాగ్యం జగనన్న కల్పించారని, మీరందరూ ఒక్క అవకాశం ఇస్తే నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ముందంజలో ఉంచుతానన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జగనన్న పంపిన ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డిని, అదేవిధంగా నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. మండల అధ్యక్షులు దొడ్డాలి మల్లికార్జునరావు, యాళ్ల హనుమంతరావు, లగడపాటి మాదవరావు, చెరుకూరి శ్రీనివాసులు, పాలెపు బ్రహ్మయ్య, గుట్లపల్లి మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక

గిద్దలూరు రూరల్: పట్టణంలోని నరవ రోడ్డులో సీతారామ కల్యాణ మండపం ఆవరణలో శుక్రవారం ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి, గిద్దలూరు సమన్వయకర్త కేపీ నాగార్జునరెడ్డి సమక్షంలో కంభానికి చెందిన టీడీపీ రాష్ట్ర తెలుగు యువత నాయకుడు షేక్.ఇర్ఫాన్, కంభం పట్టణ టీడీపీ మాజీ అధ్యక్షుడు షేక్.బాబు, మాజీ ఎంపీటీసీ ఇస్మాయిల్, ఖాజాతో పాటు సుమారు వంద కుటుంబాల వారు టీడీపీని వదలి వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ కండువాలు కప్పుకుని చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, నాగార్జున రెడ్డిల గెలుపునకు కృషి చేస్తామని చెప్పారు.



చెవిరెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన మైనార్టీ నాయకులు

మళ్లీ జగన్ వస్తేనే సంక్షేమ పథకాలు



మైనంపాడులో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి మేరుగు నాగార్జున

- సంతనూతలపాడు ఎమ్మెల్యేగా గెలిపించండి
- మంత్రి మేరుగు నాగార్జున

చీమకుర్తి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి మళ్లీ ఆయన్ను ముఖ్యమంత్రిగా చేసుకోవాలని, సంతనూతలపాడు నియోజకవర్గ ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు చీమకుర్తిలోని 1, 2, 20 వార్డుల్లో స్థానిక కౌన్సిలర్లు గోగినేని అనసూర్యమ్మ, గంగిరెడ్డి ఇందిర సుందరరామిరెడ్డి, తప్పెట బాబూరావుతో పాటు పార్టీ పట్టణ కన్వీనర్ క్రిష్టిపాటి శేఖరరెడ్డి, పార్టీ నాయకులతో కలిసి మంత్రి మేరుగు నాగార్జున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ గుర్తుతో కరపత్రాలను అందిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన గత ఐదేళ్లలో పేద ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను ఏఏ ఇంట్లో లబ్ధిదారులకు అందాయో ఆరా తీశారు. పథకాలు నిరంతరం అందాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా చేసుకుందామని విజ్ఞప్తి చేశారు. సంతనూతలపాడు నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలిపించినట్లయితే అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని భరోసా ఇస్తూ స్థానిక ఓటర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తల్లో మనోధైర్యాన్ని నింపుతూ నిర్వహిస్తున్న ప్రచారం చూపరులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యులు గోగినేని వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు సోమా శేషాద్రి, బడే అయ్యపరెడ్డి, ఆముదాలపల్లి రామబ్రహ్మం, పాలడుగు సుబ్బారావు, స్థానికులు పాల్గొన్నారు.



దివ్యాంగురాలితో మాట్లాడుతున్న మంత్రి మేరుగు

మైనంపాడులో పార్టీ కార్యాలయం ప్రారంభం: ముందు రోజు గురువారం రాత్రి సంతనూతలపాడు మండలం మైనంపాడు గ్రామంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మంత్రి మేరుగు నాగార్జున ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని పార్టీ నాయకులతో పరిచయ కార్యక్రమంతో పాటు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేస్తున్న తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, ఎంపీపీ బీ.విజయ, జెడ్పీటీసీ దుంపా రమణమ్మ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఒంగోలులో భారీ చోరీ

- సెల్‌ఫోన్ షాప్‌లో రూ.32 లక్షలకు పైగా విలువైన సెల్‌ఫోన్లు చోరీ
- రూ.5 లక్షల నగదు కూడా అపహరణ

ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగరంలోని కర్నూల్ రోడ్డు ఫ్లయ్ ఓవర్ సమీపంలోని సెల్‌షాపును దొంగలు లూటీ చేశారు. గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు షాపు షట్టరు పగులగొట్టి లోనికి ప్రవేశించి భారీ స్థాయిలో సెల్‌ఫోన్లు, నగదు అపహరించుకుపోయారు. ఒంగోలు తాలూకా సీఐ ఎం.భక్త వత్సల రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం కర్నూల్ రోడ్డులోని అక్షిత సెల్‌ఫోన్ షాపు షట్టర్లు పగులగొట్టి ఉన్నాయంటూ షాపు యజమాని శ్రీనుకు ఆటోడ్రైవర్లు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారని చెప్పారు. వెంటనే అతను పోలీసులకు సమాచారం ఇవ్వడంతో.. క్లూస్ టీమ్ బృందాన్ని రప్పించామన్నారు. దుండగుల వేలిముద్రలు సేకరించామని చెప్పారు. షాపు యజమాని చెబుతున్న దాని ప్రకారం షాపులో రూ.10 వేల నుంచి రూ.1.30 లక్షల వరకు విలువైన సెల్‌ఫోన్లు అపహరణకు గురయ్యాయన్నారు. మొత్తం రూ.30 నుంచి 32 లక్షల విలువైన సెల్‌ఫోన్లు, రూ.5 లక్షల నగదు చోరీ అయ్యాయని పోలీసులకు చెప్పినట్లు తెలిపారు.

వైఎస్సార్ సీపీ పేదల ప్రభుత్వం

- సమన్వయకర్త డాక్టర్ దద్దాల
- అక్కంపేటలో 52 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరిక

పామూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదల, మహిళల పక్షపాతి అని కనిగిరి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ దద్దాల నారాయణయాదవ్ అన్నారు. బోడవాడ పంచాయతీ పరిధిలోని అక్కంపేటలో 52 కుటుంబాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం యక్కలూరి రమణారెడ్డి, గోవిందు కొండారెడ్డి ఆధ్వర్యంలో టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి సమన్వయకర్త డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ వైఎస్సార్ సీపీ కండువావేసి సాదరంగా పార్టీలో చేరుకున్నారు. ఇన్‌చార్జ్ దద్దాల మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల అభివృద్ధికి దన్నుగా నిలిచారన్నారు. సామాజిక న్యాయం చేసి వెనుకబడిన కులాల వారిని రాజ్యాధికారంలో భాగస్వాములను చేసిన ఘన సీయం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. పార్టీలో చేరిన అయ్యన్న, చెన్నమ్మ, ఇమ్మానియేలు, శ్యాములు, నల్లయ్య, వీరరాఘవయ్య, దాసరి నారాయణ, సుబ్బయ్య, కొండయ్య, మల్లికార్జున, మహేంద్ర, మధు, బాబు, మరి కొందరు మాట్లాడుతూ ముఖ్యమంత్రి సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులమై వైఎస్సార్ సీపీలో చేరినట్లు తెలిపారు. ఎమ్మెల్యేగా దద్దాల నారాయణ యాదవ్, ఎంపీగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిల గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. అనంతరం పొగాకు బ్యారన్ల వద్ద కార్మికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కల్లూరి రామిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పువ్వాడి రాంబాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ షేక్ చాంద్ బాషా, పార్టీ యూత్ మండల అధ్యక్షుడు యాదాల సాయికిరణ్, అంబటి కొండారెడ్డి, గట్లా విజయ భాస్కర్ రెడ్డి, షేక్ గయాజ్, గోవిందు కొండారెడ్డి, యక్కలూరి రమణారెడ్డి, మందిరెడ్డి నారాయణరెడ్డి, యం.అనంతరెడ్డి, యాటా రాఘవేంద్ర, సుబ్బారెడ్డి, పుట్లూరి శివ, ఇర్రి కృష్ణారెడ్డి పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గుడిపాడులో టీడీపీ నాయకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న దద్దాల



అక్కంపేటలో వైఎస్సార్ సీపీలో చేరిన కార్యకర్తలతో దద్దాల నారాయణయాదవ్

గుడిపాడులో..

కనిగిరి రూరల్: మండలంలోని గుడిపాడు పంచాయతీకి చెందిన పలువురు టీడీపీ నాయకులు శుక్రవారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దద్దాల నారాయణ సమక్షంలో పార్టీలో చేరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో కొత్తపాలెం, గోవిందవారిపాలెం గ్రామాలకు చెందిన టీడీపీ సీనియర్ నాయకులు యు. బ్రహ్మారెడ్డి, కొండా పెద తిరుపతిరెడ్డిలతో పాటు మరికొందరికి దద్దాల కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. దద్దాల మాట్లాడుతూ పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం ఉంటుందన్నారు. సర్పంచ్ దామిరెడ్డి నాగేంద్రారెడ్డి, దాదిరెడ్డి మాలకొండారెడ్డి, మూలే కృష్ణారెడ్డి, గవిరి బోయిన సుబ్బారావు, కల్లూరి రవీంద్రారెడ్డి, కొండా శ్రీనివాసులరెడ్డి, చీమల చిన్న నారాయణ, ఎస్‌కే మస్తాన్, పెద్ద ఖాశిం వలి, ఖాదర్‌వలి, గవిరి బోయిన నాగార్జున, పిచ్చయ్య, కాకునూరి చిన్న రాయుడు, బండి ఏసు, నంబూరి ఏసు పాల్గొన్నారు.

దర్శిలో మళ్లీ ఎగిరేది వైఎస్సార్ సీపీ జెండానే!



మాట్లాడుతున్న బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి

- కార్యకర్తలే పార్టీకి బలం
- అందరి అభిమానం, ప్రజాశీస్సులే వైఎస్సార్ సీపీ గెలుపునకు నాంది
- పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

దర్శి: రానున్న ఎన్నికల్లో దర్శి నియోజకవర్గంలో మళ్లీ ఎగిరేది వైఎస్సార్ సీపీ జెండానే అని దర్శి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి స్పష్టం చేశారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గ్రామాల వారీగా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. గ్రామాల్లో నాయకులు కార్యకర్తలను ఎన్నికలకు సన్నద్ధం చేయాలని సూచించారు. అందుకు అనుసరించాల్సిన వ్యూహాలను వివరించారు. బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజాసంక్షేమమే లక్ష్యంగా పాలన కొనసాగించారన్నారు. గత చంద్రబాబు హయాంలో పాలనకు.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు ఉన్న తేడాను ప్రతి నాయకుడు, కార్యకర్త ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. గతంలో జన్మభూమి కమిటీల వలన ప్రజలు పడ్డ ఇబ్బందులు ప్రజల్లోకి తీసుకుని వెళ్లాలని సూచించారు. ఇప్పుడు వలంటీర్ల ద్వారా ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి ఫలాలు, వలంటీర్లు ప్రతి ఇంటికీ ఒకటో తేదీ అందిస్తున్న పింఛన్లు వారికి తెలియజేశారు. గత చంద్రబాబు పాలనలో పింఛన్ల కోసం వృద్ధులు పడ్డ ఇబ్బందులు గుర్తు చేయాలని వివరించారు. కరోనా ఉన్న కాలంలో ఎంతో మంది కూలీలు, పేదలకు పనులు లేక అల్లాడుతున్న సమయంలో జగనన్న పథకాలే ఆదుకున్నాయని వివరించారు. కార్యకర్తలకు ప్రజలకు ఎటువంటి అవసరాలున్నా ఎవరితో పని లేకుండా నేరుగా తన వద్దకు వచ్చి సమస్య పరిష్కారం చేసుకోవచ్చని తెలిపారు. ఎప్పుడు వచ్చినా మీ రాకకోసం బూచేపల్లి ఇంటి తలుపులు తెరిచే ఉంటాయని చెప్పారు. దర్శిలోనే నివాసంలో ఉంటూ మీకు సేవలందించుకునే భాగ్యాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కల్పించారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తు పై ఓట్లేసి వేయించి తనను, ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, వ్యవసాయ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారెడ్డి సుబ్బారెడ్డి, ఎంపీపీ సుధా అచ్చయ్య, వైస్ ఎంపీపీలు సోము దుర్గారెడ్డి, కొరివి ముసలయ్య, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, సర్పంచ్‌లు సంఘం అధ్యక్షుడు కేసరి రాంభూపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు చింతలపూడి శ్రీనివాసరెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ కేవీ రెడ్డి, మాజీ సాగర్ ప్రాజెక్టర్ వైస్ చైర్మన్ సద్దిపుల్లారెడ్డి, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంతా మా ఇష్టం!

- సింగరాయకొండలో ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన టీడీపీ నేతలు
- అనుమతి లేకుండా టీడీపీ కార్యాలయం నిర్వహణ
- పంచాయతీ కార్యదర్శి నోటీసిచ్చినా అడ్డగోలుగా సమాధానం

సింగరాయకొండ(మర్రిపూడి): ఎన్నికల నియమావళిని టీడీపీ నేతలు ఏమాత్రం ఖాతరు చేయడం లేదు. అనుమతి లేని పార్టీ కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యుడు దామచర్ల సత్య కార్యక్రమాలు నిర్వహించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. సింగరాయకొండ మండలంలోని సోమరాజుపల్లి పంచాయతీ టీపీ నగర్‌లో నివాసం ఉంటున్న పొన్నం బ్రహ్మయ్య తన ఇంటి వద్ద టీడీపీ కార్యాలయం పెట్టే ఉద్దేశంతో పసుపు రంగు వేయించాడు. ఎన్నికల నిబంధనల ప్రకారం ఇంటికి పసుపు రంగు తొలగించాలని సూచిస్తూ ఈనెల 22వ తేదీన పొన్నం బ్రహ్మయ్యకు గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు నోటీసు జారీ చేశారు. ఆయన ఇంటి వద్ద అందుబాటులో లేకపోవటంతో అతనికి నోటీసు అందజేయాలని గ్రామానికి చెందిన గంధం కోటేశ్వరరావుకు ఇచ్చారు. అయినా బ్రహ్మయ్య తన ఇంటికి వేసిన పసుపు రంగు తొలగించకుండా «నా సొంత ఇల్లు» అని అధికారులను నమ్మించే ప్రయత్నం చేశాడు. కానీ శుక్రవారం టీపీ నగర్‌లో పొన్నం ప్రభాకర్ ఇంటి వద్ద టీడీపీ నేత దామచర్ల సత్య ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. దీంతో గ్రామస్తులు పొన్నం ప్రభాకర్‌పై ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ.. శుక్రవారం సెలవు దినం అయినందున శనివారం ప్రభాకర్‌కు మరోమారు నోటీసు జారీ చేస్తామని, అనుమతి తెచ్చుకోవాలని చెబుతామన్నారు.



టీపీ నగర్‌లో పొన్నం ప్రభాకర్ ఇంటి వద్ద పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్న దామచర్ల సత్య

టీడీపీ ప్రచారంలో మిడ్ డే మీల్స్ నిర్వాహకురాలు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని నల్లబండ బజారుకు చెందిన బొంతా లక్ష్మీదేవి గిద్దలూరు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం నిర్వాహకురాలిగా విధులు నిర్వహిస్తోంది. అయితే టీడీపీ నాయకులకు సంబంధించి ఎన్నికల ప్రచారంలో శుక్రవారం పాల్గొని తెలుగు దేశం పార్టీకి ఓటు వేయాలంటు ఇంటింటా ప్రచారం నిర్వహించింది. టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి సతీమణి పుష్పలీలతో పాటు మరో కొందరు టీడీపీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నప్పటికీ ఎన్నికల అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ప్రచారంలో పాల్గొన్న లక్ష్మీదేవి

ఆరోగ్య ఉప కేంద్రం స్థలం కబ్జా

- కొత్తపట్నంలోని రెడ్డిపాలెంలో రూ.3 కోట్ల విలువైన స్థలంపై అక్రమార్కుల కన్ను
- శిథిలావస్థకు చేరిన సబ్ సెంటర్ స్థలాన్ని కాజేసేందుకు ఎత్తుగడ
- ఆక్రమణదారులను అడ్డుకున్న గ్రామస్తులు.. పోలీసుల వద్ద పంచాయితీ

కొత్తపట్నం: కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ స్థలంపై కన్నేసిన అక్రమార్కులు.. అనుకున్నదే తడవుగా ఆక్రమించేందుకు యత్నించారు. ప్రజలకు వైద్య సేవలందించడం కోసం 50 ఏళ్ల క్రితం ప్రభుత్వానికి దాతలు విరాళంగా ఇచ్చిన ఆ స్థలం తమదంటూ అడ్డుకోబోయిన గ్రామస్తులతో ఆక్రమణదారులు వితండవాదానికి దిగారు. దీంతో పంచాయితీ పోలీస్ స్టేషన్‌కు చేరింది. వివరాల్లోకి వెళ్తే.. కొత్తపట్నం పంచాయతీ పరిధిలోని రెడ్డిపాలెంలో ఆరోగ్య ఉప కేంద్రం నిర్మించేందుకు జెట్టి శంభారెడ్డి, జెట్టి అమరచంద్రారెడ్డి సోదరులు గ్రామ రెవెన్యూ సర్వే నంబర్ 1429–బీలో 10 సెంట్ల స్థలాన్ని విరాళంగా ఇచ్చారు. అప్పటి జిల్లా మెడికల్ అండ్ హెల్త్ అధికారి పేరు మీద ఆ స్థలాన్ని గిఫ్ట్ డాక్యుమెంట్ నంబర్–2081తో రిజిస్ట్రేషన్ చేశారు. ఆ స్థలంలో ప్రభుత్వం నిర్మించిన ఆరోగ్య ఉప కేంద్రం కాల క్రమంలో శిథిలావస్థకు చేరింది. ఇదే అదనుగా భావించిన కొందరు ఆక్రమణదారులు ఆ స్థలాన్ని కబ్జా చేసి వారి స్వాధీనంలో పెట్టుకున్నారు. వైద్య సిబ్బందిని సైతం ఆ స్థలంలోకి రానివ్వకుండా బెదిరించడం ప్రారంభించారు. ఇదిలా ఉండగా శుక్రవారం ఆ స్థలాన్ని పొక్లెయిన్‌తో చదును చేస్తుండగా గ్రామస్తులు అడ్డుకున్నారు. అదే స్థలంలో ప్రభుత్వ ఆరోగ్య ఉప కేంద్రం పునఃనిర్మిస్తే అందరికీ ఉపయోగకరంగా ఉంటుందని గ్రామస్తులు చెప్పగా ఆక్రమణదారులు వితండవాదానికి దిగారు. సుమారు రూ.1.5 కోట్ల విలువైన స్థలం కళ్ల ముందే ఆక్రమణకు గురవుతుండటం, హెల్త్ సబ్ సెంటర్ నిర్మాణానికి ఆటంకం కలుగుతుందని భావించిన గ్రామస్తులు కబ్జా యత్నాన్ని అడ్డుకున్నారు. దీంతో పంచాయితీ పోలీసుల వద్దకు చేరింది. ఎస్సై బి.సాంబశివరావు ఆక్రమణదారులతోపాటు గ్రామస్తులను స్టేషన్‌కు పిలిపించి మాట్లాడారు. ఆరోగ్య ఉపకేంద్రం స్థలంలో అక్రమ కట్టడాలు నిర్మిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



గృహం నిర్మించుకోవడానికి స్థలాన్ని చదును చేసిన దృశ్యం

గిరిజన సంక్షేమానికి సీఎం జగనన్న కృషి

యర్రగొండపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గిరిజన సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు పరిచారని, ఆర్వోఎఫ్ఆర్ చట్టాన్ని పగడ్బందిగా అమలు పరచి వారి అభ్యున్నతికి ఎనలేని కృషి చేశారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం మండలంలోని పాలుట్ల గిరిజన గూడెంలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ అటవీ హక్కుల చట్టాన్ని తొలిసారిగా రాష్ట్రంలో అమలు పరచి భూ పంపిణీ చేశారని, ఆయన తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి ఒక అడుగు ముందుకువేసి ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు పొందిన గిరిజన రైతులకు బ్యాంకు రుణాలకు అర్హత కల్పించారని, రైతు భరోసా వర్తించే విధంగా చర్యలు తీసుకున్నారన్నారు. గిరిజన పంచాయతీలలో సైతం సచివాలయాలు ఏర్పాటు చేసి పాలనను తమ వద్దకే తీసుకొని వచ్చారని, రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు తమ ఇంటిముంగిటకే చేర్చించే విధంగా చర్యలు తీసుకున్నారన్నారు. పాలుట్ల గిరిజన పంచాయతీలో ఉన్న సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారు. తాను నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని, పార్లమెంటు అభ్యర్థిగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పోటీ చేస్తున్నారని తమ గెలుపు కోసం ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి దీవించాలని ఆయన కోరారు. ముందుగా గూడెంలోకి వెళ్లిన చంద్రశేఖర్‌ను గిరిజనులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం గడప గడపకు వెళ్లి ఎన్నికల ప్రచార కరపత్రాలను పంపిణీ చేశారు. సర్పంచ్ హనిమిబాయి, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, పార్టీ మండల అధ్యక్షుడు కె.ఓబులరెడ్డి, సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ ఎం.బాలగురవయ్య, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పి.రాములు నాయక్, నాయకులు ఎస్.వెంకటరెడ్డి, ముసలారెడ్డి, బాలచెన్నయ్య, అరుణాబాయి, పల్లె సరళకుమారి పాల్గొన్నారు.



పాలుట్లలో పర్యటిస్తున్న వైపాలెం నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్

సాయి వద్దు.. స్వాములు కావాలి!

- మంగళగిరికి చేరిన గిద్దలూరు జనసేన పంచాయితీ
- నాదెండ్ల, నాగబాబును కలిసి ఫిర్యాదు చేసిన కార్యకర్తలు



నాదెండ్లను కలిసిన జనసేన కార్యకర్తలు

ఒంగోలు టౌన్: గిద్దలూరు జనసేన పంచాయితీ ఎట్టకేలకు మంగళగిరికి చేరింది. జనసేన పార్టీకి నష్టం కలిగిస్తున్న ఇన్‌చార్జి బెల్లంకొండ సాయిబాబాని తొలగించాలని అగ్రనాయకులను కలిసి ఫిర్యాదు చేశారు. జనసేన రెబల్ నాయకుడు ఆమంచి స్వాములు కుమారుడు రాజేంద్ర నేతృత్వంలో గిద్దలూరు నియోజకవర్గంలోని గిద్దలూరు, రాచర్ల, కంభం, బేస్తవారిపేట మండలాలకు చెందిన పలువురు నాయకులు శుక్రవారం మంగళగిరిలోని ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ ప్రధాన కార్యదర్శి నాగబాబు, తెనాలిలో ఉన్న పార్టీ పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్‌ను కలిశారు. సాయిబాబా తీరుతో పార్టీ భూస్థాపితం అవుతోందని, హైదరాబాద్‌లో నివాసం ఉంటూ అమావాస్య, పున్నమికి ఒకసారి వచ్చివెళ్తుంటాడని చెప్పారు. ఇప్పటి వరకు గ్రామ, మండల స్థాయిలో కనీసం ఒక్క సమావేశం కూడా ఏర్పాటు చేయకపోగా పార్టీని బలోపేతం చేసేదిశగా ఆమంచి స్వాములు చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకుంటున్నాడని ఆరోపించారు. ఆమంచి సమావేశాలకు పోవద్దంటూ కార్యకర్తలను తిడుతూ మెసేజులు పెడుతున్న విషయాన్ని ప్రస్తావించారు. అందుకు సంబంధించిన వీడియోలను సైతం నాగబాబు, నాదెండ్లకు చూపించినట్లు సమాచారం. జనసేన కార్యకర్తల ఆవేదనను ఆలకించిన ఇద్దరు నేతలు.. పవన్‌కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్తామని కార్యకర్తలకు సర్దిచెప్పి పంపారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ

- ఒకరు మృతి, మరొకరికి గాయాలు



మృతుడు రామారావు (ఫైల్)

ముండ్లమూరు: మండలంలోని వేంపాడు వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గోపనబోయిన రామారావు (40) అక్కడికక్కడే మృతి చెందాడు. పెదరావిపాడు గ్రామానికి చెందిన ఉలవ నాగేంద్రబాబుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. వేంపాడు గ్రామానికి చెందిన గోపనబోయిన రామారావు పెద రావిపాడు వద్ద కౌలుకు పొలం తీసుకొని మిరప సాగు చేశాడు. తన కుటుంబ సభ్యులు చేలో మిరప కాయల కోత కోసేందుకు ఉదయాన్నే పొలం వెళ్లారు. వారికి టిఫిన్ తీసుకొని వెళ్లేందుకు రామారావు ముండ్లమూరు ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. అక్కడ టిఫిన్ చేసి.. చేలో పని చేస్తున్న భార్య, పిల్లలకు పార్సిల్ కట్టించుకొని పొలం బయలు దేరాడు. వేంపాడు – ఈదర రోడ్డులో మార్గంలో పెదరావిపాడులోని తన పొలం వద్ద రాగానే ఎదురుగా వస్తున్న ఉలవ నాగేంద్రబాబు.. మరొక ద్విచక్ర వాహనం పై వస్తూ ప్రమాదకర మలుపు వద్ద ఢీ కొనడంతో రామారావు అక్కడికక్కడే మృతి చెందారు. గమనించిన కుటుంబ సభ్యులు క్షణాల్లో అక్కడకు చేరుకొని పరిశీలించగా రామారావు మృతి చెంది కనిపించాడు. కళ్ల ముందే రామారావు ప్రాణాలు పోవడంతో భార్య చిన ఆదిలక్ష్మి, కుమార్తెలు సంజన, రుక్మిణి, కుమారుడు రాజేష్ తల్లడిల్లి పోయారు. వారి రోదనలతో విషాద వాతావరణం నెలకొంది. తీవ్రంగా గాయపడిన ఉలవ నాగేంద్రబాబును కుటుంబ సభ్యులు ప్రైవేట్ వాహనంలో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. ఎస్‌ఐ ఆంజనేయులు సిబ్బందితో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉంటే ఆ మార్గంలో ప్రమాదకర మలుపులున్నా... అక్కడ ఎలాంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం పట్ల ఆర్అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యంపై వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.



ప్రమాద స్థలంలో కారణాలను అడిగి తెలుసుకుంటున్న ఎస్‌ఐ ఆంజనేయులు

శేష వాహనంపై శ్రీవారు

కొనకనమిట్ల: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వెలుగొండలో బ్రహ్మోత్సవాలు వేడుకగా సాగుతున్నాయి. శుక్రవారం శ్రీవారు శేష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవ ఉభయదాతలుగా మారెళ్ల నాగ వెంకటదిలీప్‌కుమార్, తిరుపతిరావు, వెంకట సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు దంపతులు వ్యవహరించారు. ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి, చైర్మన్ సానికొమ్ము తిరుపతిరెడ్డి, ధర్మకర్తలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



శేష వాహనంపై దర్శనమిస్తున్న శ్రీవారు

తిరునాళ్లకు పటిష్ట బందోబస్తు : డీఎస్పీ

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 31 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు నిర్వహించనున్న తిరునాళ్లకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తామని దర్శి డీఎస్పీ అశోక్‌వర్ధన్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన దేవస్థానం చైర్మన్‌తోపాటు సీఐ మల్లికార్జునరావు, ఎస్సై మాధవరావుతో కలిసి వెలుగొండ క్షేత్రంలో పర్యటించారు. ఎన్నికల కోడ్‌కు అనుగుణంగా తిరునాళ్ల నిర్వహించాలని ఆలయ కమిటీకి సూచించారు.

ఉత్సవాలకు ఆహ్వానం

మార్కాపురం టౌన్: మార్కాపురంలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి దేవస్థానం నాలుగు రాజగోపురాల కలశస్థాపన, నూతన ధ్వజ స్తంభ పునఃప్రతిష్ఠాపన, మహా కుంభాభిషేకానికి హాజరుకావాలని త్రిదండి రామానుజ చినజీయర్ స్వామికి శుక్రవారం హైదరాబాద్‌లో ఆలయ చైర్మన్ పెనుగొండ కేశవరావు, కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఉత్సవాలు ఈ నెల 31 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలియజేశారు. ఏప్రిల్ 4వ తేదీ ఉదయం 9.18 గంటలకు రాజగోపుర కలశాలు, ధ్వజ స్తంభ పునఃప్రతిష్ఠ, కుంభాభిషేకం, అనంతరం నాలుగు మాఢ వీధుల్లో స్వామివారి ఉత్సవం నిర్వహించనున్నట్లు వివరించారు. ఆలయ ప్రధాన అర్చకులు అప్పనాచార్యులు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యురాలు గుంటక వనజాక్షి చెన్నారెడ్డి తదితరులు ఉన్నారు.



చిన్నజీయర్‌స్వామికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ట్రాక్టర్, ఆటో ఢీ

- ఒకరు మృతి, ఇద్దరికి తీవ్ర గాయాలు

సింగరాయకొండ(మర్రిపూడి): ట్రాక్టర్, ఆటో ఢీకొన్న ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన శుక్రవారం రాత్రి సింగరాయకొండ మండలంలోని ఊళ్లపాలెం రోడ్‌లో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం .. మండలంలోని బింగినపల్లి పంచాయతీ పెదన్నపాలేనికి చెందిన పద్మ(40), పి.రమాదేవి, ప్రహర్ష కృష్ణ జిల్లా పెదకంచిపురంలోని తిరుపతమ్మగుడి తిరునాళ్లకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో సింగరాయకొండ చేరుకుని అక్కడి నుండి ఆటోలో ఇంటికి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో పద్మ మృతి చెందగా, మిగిలిన ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. ఎస్సై శ్రీరాం సంఘటన స్థలానికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు.